పంచాయతీలైనా తీరని కష్టాలు

- ఆరేళ్లు కావస్తున్నా ఏర్పాటు కాని రేషన్ దుకాణాలు
- నరుకుల కోసం కిలోమీటర్లు నడవాల్సిందే
- బీర్‌పూర్ మండలంలో 5, సారంగాపూర్ మండలంలో 7 నూతన పంచాయతీలు


పోచంపేట గ్రామపంచాయతీ

సారంగాపూర్: పరిపాలన సౌలభ్యం కోసం ఆరేళ్ల క్రితం గత ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. దీంతో ఆయా తండాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో ప్రత్యేక వ్యవస్థ రూపుదిద్దుకుంది. కానీ సదరు తండాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు కాలేదు. దీంతో ఆయా గ్రామస్తులు కిలోమీటర్ల కొద్ది దూరంలో ఉన్న రేషన్ షాపుల్లో నిత్యవసర సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు.

రెండు మండలాల్లో 12 పంచాయతీలు

500 జనాభా దాటి, అప్పటి పంచాయతీలకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. కొన్ని గిరిజన గ్రామాలను అక్కడి పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సడలించి 500 కంటే తక్కువ జనాభా ఉన్నా, 2 కిలోమీటర్ల లోపు దూరం ఉన్నా ప్రభుత్వం పంచాయతీలుగా గుర్తించింది. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, కోమన్‌పల్లి, కందెనకుంట, ఇందిరానగర్, గొండుగూడెం (మంగేళ), సారంగాపూర్ మండలంలో ఒడ్డెరకాలనీ, భీంరెడ్డిగూడెం, మ్యాడారంతండా, లచ్చనాయక్‌తండా, నాయికపుగూడెం, పోచంపేట, ధర్మనాయక్‌తండా పంచాయతీలుగా ఏర్పడ్డాయి.

కిలోమీటర్ల కొద్ది కాలినడక..

అయా కొత్త పంచాయతీ పరిధిలోని ప్రజలు ప్రతీ నెల తమకు వచ్చే రేషన్‌బియ్యంతో పాటు, ఇతర సరకుల కోసం 2 నుంచి 4 కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్లి నెత్తిన మోస్తూ తెచ్చుకోవాల్సి వస్తోంది. మరి కొంతమంది రేషన్ షాపులకు ఆటోల్లో వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. దీంతో తమకు దూరభారంతో పాటు సమయం, శ్రమ, ఆర్థికంగా నష్టం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఒక గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న దుకాణానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉండాలి. జనాభా 200 దాటాలి. ఈ నిబంధనల ప్రకారం దాదాపు సదరు పంచాయతీల్లో కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటుకు వీలుంది. కానీ వాటిపై ఎలాంటి పురోగతి లేదు.

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి



గ్రామపంచాయతీ ఏర్పాటుతో చాలా సమస్యలు తీరాయి. రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. ప్రతీ నెల రేషన్‌బియ్యం తెచ్చుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– మేనేని బుచ్చి మల్లయ్య, భీంరెడ్డిగూడెం

ప్రభుత్వ పరిశీలనలో ఉంది



ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాలకు దూరాన్ని బట్టి కొత్త దుకాణం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కొత్త పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే ఏర్పాటు చేస్తాం.

– వొగెటి భాస్కర్‌రావు, ఆర్‌ఐ, సారంగాపూర్



జగిత్యాలటౌన్: జగిత్యాల కొత్త బస్టాండ్ ఆవరణలో తిష్టవేసిన పశువులు రోజుల తరబడి అక్కడే ఉంటున్నాయి. పలు సందర్భాల్లో ప్లాట్‌ఫాంలపై సైతం సేదతీరుతున్నాయి. రద్దీ సమయాల్లో బస్ హారన్లకు బెదురుతూ ఎటుపడితే అటు పరుగులు తీస్తుండటంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా వాటి మలమూత్రాలతో బస్టాండ్ ప్రాంతం దుర్గంధభరితంగా తయారవుతూ ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. పశువులను తరలించి ప్రమాదాలు జరగకుండా చూడాలని, బస్టాండ్ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సునీత,డిపో మేనేజర్, సెల్ నంబర్: 99592 24547

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ కుటుంబ సభ్యులైన ప్రతీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు ముత్యంపేటలో కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డితో కలిసి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి కూన గోవర్ధన్, నాయకులు మామిడి రాజశేఖర్‌రెడ్డి, ఎనడ్ల రాములు, ఎండీ.మహబుబ్, మిట్టపల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం మంజూరు చేయించండి


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని దావన్‌పల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించాలని గ్రామానికి చెందిన నాయకులు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రం మంజూరు చేసేల చూడాలని అదనపు కలెక్టర్‌కు లేఖ రాశారు. రెబ్బాస్ మల్లయ్య, శ్రీరాంసురేశ్, సురేందర్, ప్రభాకర్, సాగర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలి


జగిత్యాలలో వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు


ఇబ్రహీంపట్నం: వినతిపత్రం ఇస్తున్న తపస్ బాధ్యులు

జగిత్యాలటౌన్/మెట్‌పల్లి/రాయికల్/ధర్మపురి/మల్లాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి: ఈ కుబేర్‌లో నెలల తరబడి పెండిగ్‌లో ఉన్న బిల్లులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4 డీఏలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, రాష్ట్ర సహ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జగిత్యాల అర్బన్ తహసీల్దార్ ద్వారా వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల పట్టణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, రామకృష్ణ, రాజశేఖర్‌శర్మ, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. మెట్‌పల్లిలో తపస్ బాధ్యులు డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌మహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. లింబగిరిస్వామి, అంకతి లింగారెడ్డి, ర్యాగల్ల మహేశ్, నరసింహాచారి, జయేందర్, మనోజ్ ఉన్నారు. రాయికల్‌లో తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సీఎం శర్మ వేముల మధు, రజనీకాంత్, శ్రీనివాస్, నర్సయ్య, ప్రశాంత్, గంగాధర్, రమేశ్ పాల్గొన్నారు. ధర్మపురిలో డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. తపస్ రాష్ట్ర బాధ్యులు రొట్టె శ్రీనివాస్, జిల్లా బాధ్యులు బండి మహేశ్, మండల అధ్యక్షుడు కాశెట్టి రమేశ్ తదితరులున్నారు. మల్లాపూర్‌లో తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. మండల ప్రధాన కార్యదర్శి రాజు, రాజేందర్, గోవర్ధన్, వెంకటరమణ, గణేశ్, ప్రతాప్, సత్తయ్య పాల్గొన్నారు. సారంగాపూర్‌లో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, పూర్ణచెందర్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు జకిలేటి శ్రీనివాస్‌రావు, బోయినపల్లి చంద్రశేఖర్, మ్యాన రమాదేవి, గంగారెడ్డి తదితరులు ఉన్నారు. ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిప్రతం అందజేశారు. మండల అధ్యక్షుడు భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భీమారం తహసీల్దార్ రవికిరణ్, మేడిపల్లి తహసీల్దార్ వసంతకు తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం తిరుమల్‌రెడ్డి, నాగమల్ల రమేశ్, జిల్లా మహిళా కన్వీనర్ నీలిమ, అశోక్, భీమయ్య, అజయ్, లీలన్‌కుమార్, లింగమూర్తి, గంగాధర్, వేణు అంజన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



జగిత్యాలరూరల్: పొలాసలోని సహస్ర లింగాల ఆలయంలో సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం



మల్లాపూర్: సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. మల్లాపూర్‌కు చెందిన వాసం శివకుమార్–రజిత దంపతులు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంగరాజం తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం


పూడురులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం


కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ నర్సారెడ్డి

కొండగట్టు: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్, కోనాపూర్, సూరంపేట గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, పీసీసీ సభ్యులు గోగురి మహిపాల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సావనపల్లి రమేశ్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

మల్లాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు పాతదాంరాజుపల్లి, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సహకారం డైరెక్టర్లు పూంద్ర లక్ష్మారెడ్డి, నల్ల రాజరెడ్డి, కొత్తూరి నారాయణరెడ్డి, ఎడ్ల కాశీరాం, నిగ రాజం, ప్యాక్స్ సీఈవో భూమేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్లు నూతిపెల్లి రాజం, బద్దం రాధ, నాయకులు అంతడుపుల నర్సయ్య, పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, కోమ్ముల చిన్నారెడ్డి, మైదాసు శ్రీనివాస్, మాట్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని కాచారం, వెంకట్రావుపేట్, ఒడ్యాడ్, మోత్కురావుపేట, దేశాయిపేట, కమ్మరిపేట్, దమ్మన్నపేట్, లింగంపేట్, వల్లంపల్లి గ్రామాల్లో సోమవారం మండల ప్రత్యేకాధికారి సురేందర్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏపీఎం అశోక్, సీసీ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మండలంలోని మెట్లచిట్లాపూర్, ఏఎస్ఆర్ తండాలో ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఆత్మనగర్, ఆత్మకూర్‌లో మండల వ్యవసాయాధికారి దీపిక కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏపీఎం విమోచన, సీసీలు శ్రీనివాస్, అశోక్, ఏఈవోలు రాజు, భూమేశ్వర్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని నాయికపుగూడెంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, సారంగాపూర్, అర్పపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కేంద్రాలను ఏపీఎం రాజయ్య ప్రారంభించారు. అధికారులు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం


బంక్‌ను ప్రారంభించిన సంఘ సభ్యులు

సారంగాపూర్: బీర్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు పెట్రోల్ బంక్ ప్రారంభించారు. కొల్వాయి విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, సీఈవో అయ్యోరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి


మాట్లాడుతున్న శంకర్

జగిత్యాల: ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా అధ్యక్షుడు జువ్వాజి శంకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్, ఐడీకార్డులు, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలన్నారు. శ్రీనివాస్‌గౌడ్, సత్యంరావు, రాజు, ప్రేమ్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని హనుమాన్ విగ్రహం ధ్వంసం

- అప్రమత్తమైన పోలీసులు.. నిందితుడి గుర్తింపు
- ధ్వంసమైన చోట మరో విగ్రహం ఏర్పాటుకు చర్యలు


ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి స్వాగత తోరణం వద్ద ఆంజనేయస్వామి విగ్రహం ధ్వంసమైంది. సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు, హిందూసంఘాల నాయకులు ఘటన స్థలం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిందితుడిని గుర్తించారు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతోనే ధ్వంసమైందని నిర్ధారించారు. స్వామివారి స్వాగత తోరణానికి ఒకవైపు ఆంజనేయస్వామి, మరోవైపు గరుత్మంతుడి విగ్రహాలు ఉన్నాయి. ఇందులో ఆంజనేయస్వామి విగ్రహం కొద్దిదూరంలో పడిపోయి కనిపించడంతో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు గ్రామస్తులు, అంజన్న భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో జిల్లావ్యాప్తంగా వైరల్ అయ్యింది. బీజేపీ కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటన స్థలంలో పశువుల ఎరువు కనిపించడంతో అన్నికోణాల్లో ఆరా తీశారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లెపు సిద్ధార్థ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో సారంగాపూర్ నుంచి పశువుల ఎరువును తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని ఢీకొందని, ఈ ఘటనలో విగ్రహం ధ్వంసమైందని నిర్ధారణకు వచ్చారు. సదరు రైతును పిలిచి మాట్లాడగా.. ఆయన కూడా ఒప్పుకున్నాడు.

తప్పుడు పోస్టులు పెట్టొద్దు..

ఆంజనేయ స్వామివారి విగ్రహం ధ్వంసం కావడంపై నృసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్ నుంచి పిటిషన్ స్వీకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. అల్లెపు సిద్ధార్థ్‌ను అదుపులోకి తీసుకున్నామని, మరో విగ్రహం ఏర్పాటు చేసేందుకు సిద్ధార్థ్ తండ్రి ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని, తప్పుడు పోస్టులు సోషల్‌మీడియాలో ప్రచారం చేసినా.. రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా.. ప్రజలను తప్పుదోవపట్టించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలని గ్రామానికి చెందిన రైతులు, నాయకులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కేంద్రం మంజూరుకు కృషి చేస్తానన్నారు. నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్‌రావు, ఆత్రం బీర్సాబ్, మారుతి, శంకర్, శ్రీనివాస్, ఈశ్వర్, తులసీరాం పాల్గొన్నారు. అలాగే జగన్నాథపూర్‌కు కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం అదనపు కలెక్టర్‌కు లేఖ రాశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరితాదేవి

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్జీఎఫ్ అండర్– 17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ వినీత్, అజీమ్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కొదరుపాకలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో వి.శాన్వి, లక్ష్య పాల్గొనగా, శాన్వి ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సోమవారం సదరు విద్యార్థిని ప్రిన్సిపాల్ సరితాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు అంతర్గాం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలకు అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ కోటేశ్వర్‌రావు తెలిపారు. ఈనెల 29 నుంచి జరిగే పోటీల్లో తునికి హర్షవర్ధన్, అల్లెపు పూజ, తునికి కీర్తన, శివరాత్రి శరణ్య, అల్లెపు శృతి, కుంచెపు వైశాలి పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం హెచ్‌ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు..


అనూహ్య

జగిత్యాల: పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన అనూహ్య కరీంనగర్‌లో జరిగిన జోనల్‌స్థాయి అండర్– 17 బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థిని డైరెక్టర్ హరిచరణ్‌రావు అభినందించారు.

యోగా, ధ్యానంతో ఏకాగ్రత


వలంటీర్లతో ప్రిన్సిపాల్, రెడ్‌క్రాస్ బాధ్యులు

జగిత్యాల: యోగా, ధ్యానం నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ మంచాల కృష్ణ అన్నారు. పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాలికలకు ఐదురోజుల పాటు యోగా, ధ్యానంపై శిక్షణ కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ, మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించే పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొట్టాల తిరుపతి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు'

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మహిళా విలేకరిపై విరుచుకు పడటం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం కోరుట్లలో మాట్లాడుతూ, తెలంగాణ సమాజం తాగుబోతుల్లా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గం పరువు తీస్తున్నారని ఆరోపించారు. ఆయన వల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

భూమి పట్టా చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: 'సారూ..నా భూమి నాకు ఇప్పించి పట్టా చేయాలి' అని సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కోజన్‌కొత్తూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజగౌడ్ తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. సర్వే నంబర్ 311లో ఎకరం 30 గుంటల భూమి తన పేరున ఉండగా చెక్కిల లక్ష్మీరాజగౌడ్ పేరున మార్చి పట్టా చేశారని తెలిపారు. ప్రజావాణిలో ఎంఈవో మధు, ఏవో రాజ్‌కుమార్, ఏపీఎం శంకర్, ఏపీవో కొమురయ్య పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

జగిత్యాలరూరల్: మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన ఇమ్మడి సుదర్శన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, జగిత్యాలకు చెందిన శ్రీపార్వతి పరమేశ్వర సేవ సమితి సభ్యులు బాధిత కుటుంబానికి రూ.10,800 ఆర్థికసాయం అందజేశారు.

భక్తిగీతం చిత్రీకరణ

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో సోమవారం కృష్ణచైతన్య ట్యూన్స్ యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో శివుని భక్తి గీతాన్ని చిత్రీకరించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు,ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

వెల్గటూర్: పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎంఈవో బోనగిరి ప్రభాకర్ అన్నారు. సోమవారం వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

మెట్‌పల్లి: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 30వేలకు పైగా సాధారణ సభ్యత్వాలు నమోదు చేయించారని, అలాగే క్రియాశీలక సభ్యత్వాలను కూడా పెద్ద సంఖ్యలో చేయించాలన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలపై ఫిర్యాదు

మల్యాల: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలు నిబంధనలు పాటించడం లేదని, చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

రెండో మహాసభ విజయవంతం

మల్యాల: బీడీ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా రెండో మహాసభ విజయవంతం అయిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన సభకు వందలాదిమంది బీడీ కార్మికులు, కర్షకులు తరలివచ్చారని తెలిపారు. కార్మిక హక్కుల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.